రేపు ఎంఎస్ఎంఈ పార్క్‌కు శంకుస్థాపన

పార్వతీపురం, మే12(ఆంధ్రజ్యోతి): పాలకొండ నియోజకవర్గం పనుకువలస వద్ద ఎంఎస్ఎంఈ పార్క్‌కు బుధవారం శంకుస్థాపన చేయనున్నట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం.మురళీమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరు కానున్నారని పేర్కొన్నారు. మొదటి దశలో 27.26 ఎకరాలను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.11.39 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈ పార్క్ శంకుస్థాపనకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఏడాదిన్నర దాటినా.. పూర్తికాలే..!

- ఏజెన్సీలో నత్తనడకన పీఎం జన్‌మన్ ఇళ్ల పనులు
- బిల్లుల చెల్లింపుల్లో జాప్యం
- పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలు
- గిరిజనులపై ఆర్థిక భారం
- గృహ నిర్మాణాలపై ఆసక్తి చూపని వైనం

సీతంపేట రూరల్, మే12(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో పీఎం జన్‌మన్ పథకం కింద మంజూరైన గృహ నిర్మాణాల ప్రగతి అంతంత మాత్రంగానే ఉంది. బిల్లుల చెల్లింపులు ఆలస్యం కావడం, నిర్మాణ సామగ్రి ధరలు అమాంతం పెరగడం తదితర కారణాలతో పీవీటీజీ(సవర) లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారు. ఆర్థిక భారంతో గృహ నిర్మాణాలపై ఆసక్తి చూపడం లేదు. అవగాహన కల్పించాల్సిన అధికారులు కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఉన్నతాధి కారులు హౌసింగ్ ప్రగతిపై ఎన్నిసార్లు సమీక్షలు నిర్వహించినా నిర్దేశిత లక్ష్యాలకు చేరుకోలేకపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

గతేడాది జనవరిలో సీతంపేట పరిధిలో పీవీటీజీలకు 2024 ఇళ్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో ఇంటి యూనిట్ ధర రూ.2.39లక్షలుగా నిర్ణయించింది. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.2.39 లక్షలు కాగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పీవీటీజీ(పర్టిక్లరిలీ వలనరబుల్ ట్రైబల్ (గ్రూప్స్) గృహ నిర్మాణాలు కోసం రూ.1లక్ష అందజేస్తామని ప్రకటించింది. అయితే అది ఇంకా కార్య రూపం దాల్చలేదు. లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం ప్రారంభించిన నాటి నుంచి పునాది దశలో రూ.70వేలు, రూఫ్‌లెవెల్‌కి రూ.90 వేలు, శ్లాబుకి రూ.40 వేలు, బాత్‌రూం నిర్మాణానికి రూ.12వేలు, మస్తర్ వేతనాల కింద మరో రూ.27వేలను లబ్ధిదారులకు విడతల వారీగా అంద జేస్తున్నారు. అయితే కొద్ది రోజులుగా లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందకపోవడం, సిమెంట్, ఐరన్ ధరలు ఎక్కువగా ఉండడంతో పీవీటీజీ లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. దీంతో పీఎం జన్‌మన్ పథకం కింద పీవీటీజీలకు ఇళ్లు మంజూరై ఏడాదిన్నర దాటుతున్నా.. నేటికీ నిర్మాణాలు నత్తనడకనే సాగుతున్నాయి. మంజూరైన 2024 గృహాలకు గాను ఇంకా పునాది స్థాయిలో 944, రూఫ్ లెవెల్‌లో 190, ఆర్‌వోఎఫ్ఆర్ క్లియరెన్స్ లేక 130, ఇంకా పూర్తిగా ప్రారంభించని గృహాలు 600 వరకు ఉన్నాయి. కాగా మరో 200 గృహాలు అనర్హులకు కేటాయించినట్లు సర్వేలో గుర్తించారు.


గిరిశిఖర గ్రామం తురాయిమానుగూడలో పీఎం జన్‌మన్ గృహాల పరిస్థితి ఇదీ..

ఆర్థిక భారం భరించలేక..

- సిమెంట్, ఐరన్ ఇతరాత్ర గృహనిర్మాణ సామగ్రి ధరలు మండిపోతున్న తరుణంలో ఆర్థిక భారాన్ని భరించలేక కొందరు గిరిజనులు కాంట్రాక్టర్లను ఆశ్రయిస్తున్నారు. ఇంటి నిర్మాణ బాధ్యతలను వారికి అప్పగిస్తున్నారు. బిల్ టు బిల్ ప్రాతిపదికన ఇంటి నిర్మాణ యూనిట్ ధర ఎంత ఉంటే అంతా సంబంధిత కాంట్రాక్టర్‌కు చెల్లించేందుకు లబ్ధిదారులు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.
- అంటికొండ పంచాయతీ పరిధి పెద్దగూడ, తలైబుగూడ, నీలంగూడ, తురాయిమానుగూడ, లంబగూడ గ్రామాల్లో గిరిజనుల ఇంటి నిర్మాణాలను కాంట్రాక్టర్లే చేపడుతున్నారు. లబ్ధిదారుడితో పాటు కుటుంబసభ్యులు నిర్మాణ పనుల్లో సహాయం చేయాల్సి ఉంటుంది. నిర్మాణ సామగ్రి మొత్తాన్ని కాంట్రాక్టరే ఏర్పాటు చేస్తాడు. బిల్లులు అవుతున్న ప్రాప్తికి లబ్ధిదారుడి బ్యాంక్ ఖాతా నుంచి ఆ నగదును కాంట్రాక్టర్లు తీసుకుంటారు.


లంబగూడలో పునాదులు తవ్వుతున్న గిరిజనులు


పీఎంఏవై గృహాల పరిస్థితి ఇలా..

పీఎంఏవై(ప్రధాన మంత్రి ఆవాస యోజన)గ్రామీణ పథకం కింద కేంద్ర ప్రభుత్వం సీతంపేట ఏజెన్సీకి 2021-22లో 1089 గృహాలను మంజూరుచేసింది. ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలుగా యూనిట్ ధర నిర్ణయించింది. గృహ నిర్మాణాలను వేగవంతం చేయడంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. బిల్లులు చెల్లింపులు కూడా పూర్తిస్థాయిలో జరగకపోవడంతో మొండి గోడలతోనే ఇళ్లు దర్శనమిస్తున్నాయి. 1089 గృహాలకు గాను గొయ్యిలు తీసినవి 190, పునాదులతో నిర్మించినవి 181,

(మిగతా 8వ పేజీలో...)

గురువుల బదిలీలకు వేళాయే...!

- రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో మూడు వేల మందికి పైగా స్థాన చలనం
- మార్గదర్శకాలు విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ



గజపతినగరం, మే12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విజయనగరం, మన్యం జిల్లాలకు సంబంధించి బదిలీలకు అవసరమైన ప్రాథమిక సమాచారాన్ని విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ఇప్పటికే అందజేశారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల పరిధిలో ఎస్జీటీ, స్కూలు అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయుల కేటగిరీలో దాదాపు 10వేల మందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో దాదాపు 1500 మందికి పైగా తప్పనిసరిగా బదిలీలు కావాల్సి ఉంది. మరో వెయ్యి నుంచి 1500 మందికి అర్హతలను బట్టి బదిలీలు జరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలంటున్నాయి. రెండు మూడు రోజుల్లో బదిలీలకు సంబంధించి పూర్తిస్థాయి నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది.

మార్గదర్శకాలు ఇలా..

- ఏదైనా పాఠశాలలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన గ్రేడ్-2 హెచ్ఎంలు, 8 ఏళ్లు పూర్తి చేసిన టీచర్లకు బదిలీ ఉంటుంది.
- కనీసం రెండేళ్లు పని చేసిన టీచర్లకు బదిలీలకు అవకాశం ఉంది.
- ఏ విద్యాసంవత్సరంలో అయినా మే31నాటికి తొమ్మిది నెలలు పనిచేస్తే అది పూర్తి విద్యా సంవత్సరంగా పరిగణిస్తారు.
- రెండేళ్లలో ఉద్యోగ విరమణ చేసేవారు తమ కోరిక మేరకు మాత్రమే బదిలీ అవుతారు.
- 50 ఏళ్ల లోపు పురుష ఉపాధ్యాయులు బాలికల హైస్కూలులో పని చేస్తే తప్పనిసరిగా బదిలీ చేస్తారు.
- మహిళా ఉపాధ్యాయులు లేని పరిస్థితుల్లో 50ఏళ్లు పైబడిన పురుష ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వచ్చు.
- ఎన్‌సీసీ అధికారులైన వారిని సంబంధిత యూనిట్ ఉన్న పాఠశాలకు బదిలీ చేస్తారు.
- పోక్సోకేసులు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులను బాలికల పాఠశాలల్లో లేకుండా ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలి.

పాయింట్లు ఇలా..

- ఉపాధ్యాయులు మే 31నాటికి చేసిన సేవ ఆధారంగా పాయింట్లు కేటాయిస్తారు. ఇందులో మొత్తం ఐదు పాయింట్లు ఉంటాయి.
- జంట ఉద్యోగులుగా ఉన్న దంపతులకు ఐదు పాయింట్లు కేటాయిస్తారు.
- 40ఏళ్లు దాటి పెళ్లికాని మహిళా ఉపాధ్యాయులకు ఐదు పాయింట్లు, శారీరక మానసిక లోపాలతో ఉన్న వారికి 5-7 పాయింట్లు (లోపశాతం ఆధారంగా)
- బాధ్యతాయుతంగా ఉన్న సంఘాల నాయకులకు (ఉద్యోగ సంఘాలు)ఐదు పాయింట్లు, తలసీమియా, డయాలసిస్ వంటి వ్యాధులతో బాధపడేవారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు.

ప్రాధాన్యత కేటగిరీలు..

- వందశాతం చూపు లోపం లేదా 80శాతం పైగా శారీకలోపం, 75శాతం చూపు లోపం లేదా70శాతంపైగా వినికిడి లోపం, విడాకులు తీసుకున్న మహిళలు (పునర్వివాహం అయితే వర్తించదు)
- తీవ్రమైన అనారోగ్యం ఉన్నవారు(క్యాన్సర్, ఓపెన్ హార్ట్‌సర్జరీ, కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ మొదలైనవి)
- డయాబెటిస్, తలసీమియా బాధిత సంతానం ఉంటే ప్రాధాన్యం ఇస్తారు.

వైభవం.. దేవర ఉత్సవం

- వనంగుడి నుంచి చదురుగుడికి పైడిమాంబ
- దారి పొడవునా భక్తుల జేజేలు

విజయనగరం రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, సిరులతల్లి పైడిమాంబ దేవర ఉత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. నిర్దేశించిన ముహూర్తం ప్రకారం రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి నుంచి అమ్మవారి ఊరేగింపు మొదలైంది. సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమై రాత్రి 9 గంటల ప్రాంతంలో హుకుంపేటలోని పూజారి బంటుపల్లి వెంకటరావు నివాసానికి చేరుకుంది. అక్కడ పైడిమాంబ ఘటాలకు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించిన అనంతరం పూజారి వెంకటరావు, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులతో హుకుంపేట నుంచి రాత్రి 9 గంటలకు కీలకమైన దేవర ఉత్సవం ఆరంభమైంది. ఈ ఊరేగింపు పుచ్చలవీధి, ఉల్లివీధి, కన్యకాపరమేశ్వరీ ఆలయం, గంటస్తంభం మీదుగా చదురుగుడికి చేరుకుంది. అక్కడి నుంచి కోట వద్దకు వెళ్లాక పూజలు నిర్వహించారు. దారిపొడవునా భక్తులు దేవర ఉత్సవానికి స్వాగతం పలకడమే కాకుండా జై జై పైడిమాంబ అంటూ ముందుకు సాగారు.


పైడిమాంబ ఉత్సవమూర్తితో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం

ఈదురుగాలుల బీభత్సం

- కూలిన విద్యుత్ స్తంభాలు.. నేలకొరిగిన చెట్లు
- పిడుగుపాటుకు పదకొండు గొర్రెలు మృతి


6లో
పాలకొండలో నేలకొరిగిన చెట్టుకొమ్మలు, విద్యుత్ స్తంభాలు

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 31 మంది గైర్హాజరు

బెలగాం, మే 12(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 17 కేంద్రాల్లో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 20 వరకు ఇవి జరగనున్నాయి. సోమవారం మొదటి రోజు 31 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరం 1,096 మంది విద్యార్థులకు 1011 హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం 279 మందికి 248 మంది హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల్లో పటిష్ఠ బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం వారికి పరీక్షలు జరిగాయి.

జిల్లాకు ఐఏఎస్‌ల బృందం రాక

- 20 నుంచి 22వ తేదీ వరకు పర్యటన
- ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా
- మౌలిక వసతుల పరిశీలన



పార్వతీపురం, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఐఏఎస్ అధికా రుల బృందం రానుంది. ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించనుంది. ప్రజలకు ప్రభు త్వం ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీయనుంది. మౌలిక వసతులు, తదితర అంశాలను పరిశీలించనుంది. వాస్తవంగా జిల్లాలో 20 సచివాల యాల పరిధిలో ఐఏఎస్‌ల బృందం పర్యటించేందుకు ప్రతిపాదనలు వెళ్లాయి. మిర్తివలస, రావివలస, గుణదతేలేసు, విక్రంపురం, కాశీపట్నం, పి.కోనవలస, పెదమరికి, తోణాం, గుచ్చిమి, మనుమకొండ, ఆర్కేబాయి, తంపటాపల్లి, చినగారపాడు, కిమ్మిలో అధికారుల బృందం పర్యటించే అవకాశం ఉంది. పార్వతీపురం పట్టణంలో జగన్నాథపురం, కొత్త బెలగాం, సాలూరు పట్టణం, పాలకొండలోనూ పర్యటనలకు ప్రతిపాదనలు వెళ్లాయి. అయితే ఆయా ప్రాంతాల్లో ఐఏఎస్‌ల బృందం ఎక్కడెక్కడ పర్యటిస్తుందన్నది ఇంకా ఖరారు కాలేదు. మరోవైపు ఆయా గ్రామ , వార్డు సచివాలయాలు పరిధిలో ఉన్న ప్రత్యేక అధికారులతో పాటు అన్నిశాఖల సిబ్బంది నివేదికలు తయారు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రతీవారం పురోగతి కనిపించాలి


- ఇంజనీర్లను ఆదేశించిన కలెక్టర్

పార్వతీపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో చేపట్టే పనుల్లో ప్రతీ వారం పురోగతి కనిపించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నీటిపారుదల శాఖ ఈఈలు, డీఈఈలు, ఏఈఈలతో సమీక్షించారు. చెరువులు, చెక్‌డ్యామ్‌లకు సంబంధించిన పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. 122 క్యాస్కెడింగ్‌తో పాటు చెక్ డ్యామ్‌ల పనులను ఇంతవరకు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. సర్పంచ్‌ల తీర్మానంతో స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించి నులు ప్రారంభించాలని సూచించారు. ఏఈఈల వారీగా లక్ష్యాలు నిర్దేశించుకోవాలని, ఈఈలు, డీఈఈలు సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఇకపై ప్రతి సోమవారం సమీక్షిస్తానని, ఈ లోగా ప్రగతి కనిపించాలని చెప్పారు. ఇచ్చిన లక్ష్యాలను నాలుగు వారాల్లో పూర్తి చేసిన వారికి బహుమతులు అందిస్తామన్నారు. అందుబాటులో ఉన్న నిధులతో తక్షణమే తాగునీటి పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలన్నారు. కిందిస్థాయి సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. తాగునీటి పర్యవేక్షణ సెల్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నమోదు చేయాలన్నారు. పాలకొండ పరిధిలో జన్‌మన్ కింద 108 పనుల్లో 13 పనులు ప్రారంభమయ్యా యని గ్రామీణ నీటి సరఫరా డీఈ తెలిపారు.

- 'ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో ఫాం పాండ్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. బ్లాక్ ప్లాంటేషన్ కింద కొబ్బరి మొక్కల పెంపకం చేపట్టాలి. ఈ ఏడాది ఐదు వేల ఎకరాల్లో పెంపకమే లక్ష్యంగా పెట్టుకున్నాం. నీటి సౌలభ్యం ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించాలి. ఉపాధి వేతనదారులు వడ దెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టి గ్రామాలను అభివృద్ధి చేయాలి.' అని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.
- 'భామిని మండలం మనుమకొండ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి. ప్రతి రంగంలో కనీసం 15 శాతం సుస్థిర అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా పనిచేయాలి. అధునాతన యంత్ర పరికరాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు, వంట గ్యాస్, గృహం, ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు ఉండాలి. గ్రామంలో ఫోన్, బ్రాడ్ బ్యాండ్ , విద్య, వైద్య సేవలు అందుబాటులో ఉండాలి. వన్‌దన్ వికాస్, నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. స్థానికంగా లభించే పసుపు, చింతపండు, అడ్డాకులు తదితర ఉత్పత్తులకు విలువ ఆధారిత కల్పించాలి. స్వయం ఉపాధి వైపు యువత అడుగులు వేసేలా చర్యలు తీసుకోవాలి.' అని కలెక్టర్ తెలిపారు.


పీజీఆర్ఎస్‌లో అర్జీదారుని సమస్య వింటున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

తోటపల్లి ప్రాజెక్టు పరిసరాల్లో తనిఖీలు


8లో

మహిళలకు చేదోడుగా కేవీకే

- వివిధ రంగాలలో శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు
- చిరుధాన్యాలతో బహుముఖ ప్రయోజనాలు
- బేకరీ ఉత్పత్తుల తయారీతో అధిక ఆదాయం

6లో



ఈదురుగాలుల బీభత్సం

● కూలిన విద్యుత్ స్తంభాలు.. నేలకొరిగిన చెట్లు

పాలకొండ, మే 12(ఆంధ్రజ్యోతి): పాలకొండతో పాటు వీరఘట్టం, సీతంపేట మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. నాలుగు గంటల తర్వాత వర్షం మొదలైంది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కొన్ని చోట్ల ప్రధాన రహదారిపై చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. పలుచోట్ల హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఎగిరిపోయాయి. పట్టణంలో కస్పావీధి, చినకాపువీధిల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈదురుగాలులు ప్రభావంతో మామిడి, జీడిమామిడి నేలకొరిగాయి. దీనితో వాణిజ్య రైతులు లబోదిబోమంటున్నారు.


పాలకొండ: ఈదురుగాలులతో కురుస్తున్న వర్షం

బీటలు వారిన ఇళ్లు

దత్తిరాజేరు, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఈదురు గాలుతో కూడిన వర్షం కురిపింది. దీంతో చెట్లు నేలకొరిగాయి. పిడుగు పాటుకు రెండిళ్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. పాచలవలస గ్రామానికి చెందిన సుంకరి పరశురాములు, తిరుపురం గౌరీశంకర్‌ల ఇళ్లపై పిడుగు పడటంతో గోడలకు బీటలు ఏర్పడ్డాయి. ఈదురు గాలులు వీయడంతో చెరుకుబిల్లి గ్రామం సమీపాన ప్రధాన రహదారిపై చెట్లు నేలకొరిగాయి. దీంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పడిపోయిన చెట్లు తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు.


దత్తిరాజేరు: పాచవలసలో పిడుగుపాటుకు విరిగిన ఇంటి గోడ


దత్తిరాజేరు: చెరుకుబిల్లి సమీపంలో రహదారిపై నేలకొరిగిన చెట్టు

అంధకారంలో భామిని

భామిని, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో మండల వాసులు తీవ్ర అవస్థలు పడ్డారు. దీనిపై ఏఈ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. పాలకొం డలో ఈదురు గాలుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిం దని, పునరుద్ధరించే వరకు ఎదురుచూడక తప్పదని అన్నారు.


శృంగవరపుకోట రూరల్: సీతంపేట జంక్షన్ వద్ద కురుస్తున్న వర్షం

రాజాం పరిధిలో..

రాజాం, మే 12 (ఆంధ్రజ్యోతి) రాజాంలో సోమ వారం సాయంకాలం ఈదురుగాలు బీభత్సం సృష్టించాయి. విద్యుత్ స్తంభాలు, చెట్లు నెలకొరిగాయి. మామిడి పంటకు నష్టం కలిగింది. ము న్సిపాలిటీ పరిధిలోని వస్త్రపురి కాలనీ సమీ పంలో శ్రీలక్ష్మీశ్రీనివాస జూట్ మిల్లు సమీపంలో భారీ వృక్షం నేలకొరగడంతో విద్యుత్ స్తంభం కూ లిపోయింది. పెను బాక సమీపంలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌తో పాటు నాలుగు విద్యుత్ స్తంభాలు కూలాయి. విజయరాం పురంలో మూడు విద్యుత్ స్తంభాలు నేల మట్టమయ్యాయి. మామిడి కాయలు నేలరాలడంతో రైతులకు నష్టం వాటిల్లింది.


రాజాం: చెట్టు కూలడంతో వాలిన విద్యుత్ స్తంభం

ఎస్.కోటలో జోరుగా వాన

శృంగవరపుకోట రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎండ వేడిమితో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న ప్రజలను వరుణుడు కరుణించాడు. సోమవారం మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండవేడిమితో వున్న వారికి మధ్యాహ్నం నుంచి వాతవరణంలో మార్పులు రావడంతో మధ్యాహ్నం 3 గంటల నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో ప్రజలు సేదతీరారు.


రాజాం: నేలరాలిన మామిడి కాయలు.. ఏరుతున్న రైతులు

పిడుగుపాటుకు ఒకరి మృతి

● ఇద్దరికి గాయాలు

మెంటాడ, మే 12(ఆంధ్ర జ్యోతి): మండలంలోని కుంటిన వలస గ్రామానికి చెందిన కొల్లి రాంబాబు(45) సోమవారం పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. అదే గ్రామానికి చెందిన కొల్లి సింహాచలం, మురళీ గాయాల పాలయ్యారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ సమీపంలో పొలాల్లో మట్టితవ్వకాలు జరుగుతున్నాయి. అక్కడకు రాంబాబు వెళ్తుండగా అతడిపై పిడుగు పడింది. దాంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడే ఉన్న కొల్లి సింహాచలం, మురళీ గాయపడ్డారు. వారిని గజపతినగరం ఆసుపత్రికి తరలించారు. రాంబాబు మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఆంధ్ర పోలీసులు కేసు నమోదు చేశారు.


రాంబాబు మృతదేహం

పదకొండు గొర్రెలు..

సీతానగరం, మే 12(ఆంధ్ర జ్యోతి): సుభద్ర సీతారాంపురం గ్రామ సమీపంలో సోమవారం పిడుగు పాటుకు 11 గొర్రెలు మృతిచెందాయి. ఒక్కసారిగా ఇన్ని గొర్రెలు చనిపోవడంతో యజమాని పి.నీలయ్య లబోదిబోమంటున్నాడు. రోజూలానే సోమవారం ఉదయం సమీప పొలాల్లోకి వాటిని మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగొచ్చిన సమయంలో ఒక్కసారిగా ఈదురుగాలుతో చిరుజల్లులు కురిశాయి. ఇదే సమయంలో పెద్దశబ్దంతో పిడుగు పడడంతో 11 గొర్రెలు ఒకేసారి మృతిచెందాయని పెంప కందారు తెలిపాడు. మండల పశు వైద్యాధికారి రామారావు ఘటనా స్థలా నికి చేరుకుని చనిపోయిన గొర్రెలను పరిశీలించారు. పై అధికారులకు నివేదిక అందిస్తామన్నారు.


మృతిచెందిన గొర్రెల వద్ద విలపిస్తున్న నీలయ్య

తోటపల్లిలో కల్యాణోత్సవం


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గరుగుబిల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి దేవస్థానాల పరిధిలో కోదండరామస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ నెల 8వ తేదీ నుంచి కల్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముగింపును పురస్కరించుకుని ఆలయ అర్చకుడు వీవీ అప్పలాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖడ్గవలసకు చెందిన కిమిడి శ్రీరామ్మూర్తి, భాగ్యరత్నం దంపతులు స్వామివారికి దీక్షా వస్త్రాలు అందజేశారు. భక్తులకు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ ప్రసాదాలను అందించారు.


తాళిబొట్టు చూపిస్తున్న దృశ్యం

ముగిసిన నాటిక పోటీలు

● విజేతలకు నగదు బహుమతులు


మొదటి బహుమతి అందుకుంటున్న చీకటిపువ్వు నాటిక తారాగణం


రెండో బహుమతి అందుకుంటున్న కొత్త పరిమళం నాటిక తారాగణం

గరివిడి, మే 12(ఆంధ్రజ్యోతి): గరివిడిలోని శ్రీరామ్ హైస్కూల్‌లో మూడు రోజుల పాటు గరివిడి కల్చరల్ అసోసియేషన్ నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు ఆదివారం అర్ధరాత్రి ముగిశాయి. మొదటి బహుమతిని కరీంనగర్ చైతన్య కళాభారతికి చెందిన చీకటిపువ్వు నాటిక, ద్వితీయ స్థానంలో బొరివంకకు చెందిన శర్వాణీ గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవాసంఘం ప్రదర్శించిన కొత్త పరిమళం నాటిక, తృతీయ స్థానంలో హైదరాబాద్ కళాంజలి వారు ప్రదర్శించిన రైతేరాజు నాటిక ఎంపికైంది. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారికి వరుసగా రూ.40 వేలు, రూ.37 వేలు, రూ.35 వేలతో పాటు మెమొంటోలను నిర్వాహకులు ప్రదానం చేశారు. పోటీల్లో ఉత్తమ క్యారెక్టర్ నటుడిగా చిగురుమేఘం నాటికలో చెన్నయ్య పాత్ర వేసిన కావూరు సత్యనారాయణ, ఉత్తమ ప్రతినాయకుడిగా కొత్త పరిమళం నాటికలో ఉస్మాన్ ఖాన్ పాత్ర వేసిన ఎం.వెంకటరాజు, ఉత్తమ హాస్యనటుడిగా అనూహ్యం నాటికలో ధనుష్‌కోటి పాత్ర వేసిన గూడాల హరిబాబు ఎంపికయ్యారు. ఉత్తమ రచయితగా కొత్త పరిమళం నాటికలో ధనుష్‌కోటి పాత్ర వేసిన కేకేఎల్ స్వామి, ఉత్తమ దర్శకుడిగా చీకటిపువ్వు నాటికకు సంబంధించి మంచాల రమేష్, ఉత్తమ నటిగా చీకటి పువ్వు నాటికలో నటించిన పవిత్ర పాత్ర వేసిన గుడివాడ లహరి, ఉత్తమ నటుడుగా కొత్త పరిమళం నాటికలో డాక్టర్ గోపాల్‌పాత్ర వేసిన మెట్ట పోలినాయుడు, ఉత్తమ ద్వితీయ నటిగా చిగురుమేఘం నాటికలో నర్సమ్మ పాత్ర వేసిన బి.నాగరాణిలను ఎంపిక చేశారు. వారికి బహుమతులను ప్రదానం చేశారు. గరివిడిలో ఘనంగా నాటిక పోటీలు నిర్వహించినందుకు పలువురు నిర్వాహకులను అభినందించారు.



గదబవలస వైపు గజరాజులు

గరుగుబిల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలో 15 రోజులకు పైగా సంచరించిన గజరాజుల గుంపు సోమవారం జియ్యమ్మవలస మండలం బాసంగి గదబవలస వైపు పయనమయ్యాయి. గత కొద్ది రోజులుగా తోటపల్లి, నందివానివలస, సుంకి, సంతోషపురం, గిజబ, తదితర గ్రామాల్లో సంచరించి అరటి, పామాయిల్, వరి పంటలతో పాటు అపరాల పంటలను ధ్వంసం చేశాయి. అలాగే వ్యవసాయ సామగ్రిని పనికిరాని విధంగా చేశాయి. గత కొన్నాళ్లుగా వచ్చిన మార్గంలోనే వస్తూ రైతులకు నష్టం కలిగిస్తున్నాయి. ఏ సమయంలో మళ్లీ తిరిగి వస్తాయోనన్న రైతులు దిగులులో ఉన్నారు.


గదబవలస వైపు వెళ్తున్న గజరాజుల గుంపు

మహిళలకు చేదోడుగా కేవీకే


రస్తాకుంటుబాయిలోని కేవీకే

- వివిధ రంగాలలో శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు
- చిరుధాన్యాలతో బహుముఖ ప్రయోజనాలు
- బేకరీ ఉత్పత్తుల తయారీతో అధిక ఆదాయం

కురుపాం రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి)

కురుపాం మండలం రస్తా కుంటుబాయి గ్రామంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) మహిళలకు చేదోడుగా నిలుస్తోంది. అధిక ఆదాయం పొందేందుకు స్వయం ఉపాధిలో శిక్షణ ఇస్తోంది. గత రెండేళ్లలో 40 శిక్షణ కార్యక్రమాల్లో 800 మంది మహిళలు వివిధ రకాల ఉత్పత్తుల తయారీలో నిష్ణాతులయ్యారని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చిరుధాన్యాలతో బేకరీ ఉత్పత్తుల తయారీ, పుట్టగొడుగుల పెంపకం, జనప నారతో బ్యాగుల తయారీ, పచ్చళ్లు, పొడులు, స్నాక్స్ తయారీపై శిక్షణ ఇస్తున్నారు. ప్రధానంగా స్థానికంగా దొరికే రాగులు, జొన్నలు, కొర్రలు, ఊదలు వంటి చిరుధాన్యాలను వినియోగంలోకి తేవడం ద్వారా రైతులకు మద్దతు ధర లభించేటట్టు చేస్తున్నారు. చిరుధాన్యాలతో బిస్కట్లు, కేకులు, జంతికలు, పకోడీలు, పొడులు తయారు చేసి వాటిని మార్కెటింగ్ చేస్తున్నారు. వీటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు.

శాస్త్రవేత్తలు ఏం చెబుతున్నారంటే..

ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిరుధాన్యాల ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చిరుధాన్యాలతో తయారయ్యే ఆహారం తినడం వల్ల మంచి పోషకాలు పొందడమే గాకుండా డబ్బు ఆదా చేసుకునే వీలుంది. చిరుధాన్యాల్లోని పిండి పదార్థాలు శరీర పెరుగుదలకు ఉపయోగపడతాయి. మాంసకృత్తులు, కాల్షియం, ఫాస్పరస్ పుష్కలంగా లభించడం వల్ల ఎముకలు ధృడంగా ఉంటాయి. రక్త పోటు అదుపులో ఉంటుంది. మధుమేహ వ్యాధిగ్రస్థుల్లో గుండె జబ్బుల తీవ్రత తగ్గుతుంది. శ్వాసకోస సంబంధిత వ్యాధులు.. ముఖ్యంగా ఆస్తమా తీవ్రత నుంచి ఉపశమనం కలిగిస్తుంది. చిరుధాన్యాలలో ఉండే పీచు పదార్థాల వల్ల కాన్సర్ తీవ్రత 50 శాతం తగ్గుతుంది. రక్త నాణాల్లో కొవ్వు పేరుకుపోకుండా ఉంటుంది. చిరుధాన్యాల సాగుకు తక్కువ నీరు అవసరం ఉంటుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజ నాలను పొందవచ్చని కేవీకే గృహవిజ్ఞాన శాస్త్రవేత్త డా. వై.ఉమాజ్యోతి చెబుతున్నారు. కేవీకే దత్తత తీసుకున్న కురుపాం, దురుబిలి, కారాడవలస, గిజబ, శింగనాపురం, కొత్తూరు, కారివలస, ఆమిటి తదితర 12 గ్రామాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళలు స్వయంఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు.


మహిళలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం



మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో శాసతివేత్తలు

మరింత మందికి శిక్షణ ఇస్తాం..

20 మంది మహిళలు గ్రూపుగా ఏర్పడితే వారికి అవసరమైన అంశంపై శిక్షణ ఇస్తాం. ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు కూడా నేర్పిస్తాం. శిక్షణ పొందిన వారు నిలదొక్కుకునే వరకు కేవీకేలో ఉన్న వనరులను వినియోగించుకోవచ్చు. ప్రధానంగా చిరుధాన్యాలతో చేసిన బేకరీ ఉత్పుత్తులు ఎంతో రుచిగా ఉంటాయి. ప్రస్తుతం మార్కెట్లో లభించే ఉత్పత్తులు మైదాతో తయారు చేస్తారు. అవి ఆరోగ్యానికి అంత మంచివి కావు. చిరుధాన్యాలను సమపాళ్లలో కలుపుకుని ఇంటి వద్ద తయారు చేసుకుని పెద్దలకు, పిల్లలకు పెడితే ఎంతో ఆరోగ్యంగా ఉంటారు.

-వై.ఉమాజ్యోతి. కేవీకే గృహవిజ్ఞాన శాస్త్రవేత్త

ప్రభుత్వం ప్రోత్సహిస్తే మేలు..



చిరాధాన్యాలతో ఉత్పత్తులు తయారు చేసేందుకు అవసరమైన ఓవెన్, గ్రైండర్ తదితరాల కొనుగోలు భారంగా ఉంద. ఈ మొత్తాన్ని ప్రభుత్వం రుణం రూపేణా ఇస్తే గిరిజన మహిళలకు ఉపాధి కలుగుతుంది.

-షేక్ గౌస్, స్వచ్ఛంద సేవకుడు

చిరుధాన్యాలు, పెరటి తోటలను ప్రోత్సహిస్తున్నాం..

సమతుల ఆహారం తీసుకోవడం ద్వారానే సమగ్ర ఆరోగ్యం పొందగలం. చిరుధాన్యాల ఆవశ్యకతపై శిక్షణ ఇస్తున్నాము. అలాగే పెరటి తోటల పెంపకం వల్ల కూడా సంపూర్ణ పోషకాహారం పొందే వీలుందంటూ ప్రచారం చేస్తున్నాం. జీడిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు, స్థానికంగా లభించే వివిధ రకాల గమ్‌ల సేకరణ, మార్కెటింగ్ గురించి అవగాహన కల్పిస్తున్నాము.



-ధృవ, ప్రోగ్రాం కో ఆర్డినేటరు, కేవీకే

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌లైన్ నిర్వహణ పనుల నిమిత్తం మండలంలోని చింతలవలస, బెటాలియన్, రఘుమండ, గుండాలపేట, బొడ్డవలస, కృష్ణాపురం, వెలంపేట, గెద్దవానిపాలెం, జొన్నాడు, ఆకులపేట, డి.తాళ్లవలస, దువ్వపేట, సత్యనారాయణపురం, చెల్లూరు ఇండస్ట్రియల్ ఏరియాలకు ఉదయం 9 నుం చి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

నేడు పాదాలమ్మ పండుగ

విజయనగరం రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పూల్‌బాగ్ కాలనీవాసుల ఇలవేల్పు పాదాలమ్మ తల్లి పండుగ మంగళవారం జరగనుంది. సోమవారం తొలేళ్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటా వైశాఖ మాసంలో పాదాలమ్మ పండుగను పూల్‌బాగ్ కాలనీ వాసులు నిర్వహించడం ఆనవాయితీ వస్తోంది. పూల్‌బాగ్, బాబామెట్ట, కొత్తపేట, జగదాంబ నగర్, లక్ష్మీగణపతి కాలనీ, హనుమాన్ నగర్, సిద్ధివినాయక నగర్‌తో పాటు పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పాదాలమ్మకు మొక్కుబడులు తీర్చుకోనున్నారు.

పలు డివిజన్లలో కమిషనర్ పర్యటన

విజయనగరం రింగురోడ్డు, మే 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు డివిజన్లలో సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య పర్యటించారు. డివిజన్లలో పారిశుధ్యం అమలు పరిశీలించారు. చెత్తను తరలించే వాహనాలు నిర్ణీత సమయానికి వస్తున్నాయా? లేదా అని ఆరా తీశారు. ఇంటింటి చెత్త సేకరణ ఎలా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం అన్నా క్యాంటీన్‌ను పరిశీలించి ప్రజలకు అందుతున్న ఆహారం నాణ్యతపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు.

కార్మికులను ఆదుకోండి

విజయనగరం దాసన్నపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): భీమసింగి చక్కెర కర్మాగారానికి చెందిన కార్మికుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. సోమవారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లుగా కార్మికులకు పీఎఫ్, గ్రాట్యుటీ చెల్లించలేదన్నారు. సక్రమంగా క్రషింగ్ జరుగుతున్నప్పటికీ కర్మాగారాన్ని మూసి రైతులు, కార్మికులు, ఉద్యోగుల పొట్ట కొట్టారని వివరించారు. మంత్రి కొండపల్లిని కలిసిన వారిలో కార్మిక సంఘాల ప్రతినిధులు శ్రీను, దాలినాయుడు, కృష్ణ, ఆదిబాబు, ఎర్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

నెల్లిమర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మెను అందరూ జయప్రదం చేయాలని సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకరరావు, కె.సురేష్ పిలుపునిచ్చారు. ఈ నెల 20న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం నెల్లిమర్లలో జీపు జాత నిర్వహించారు. నెల్లిమర్ల జూట్ మిల్లు, నగర పంచాయతీ కార్యాలయం, మొయిద జంక్షన్ తదితర ప్రాంతాల్లో కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ నాయకులు టీవీ రమణ, బి.సుధారాణి, ఎ.జగన్మోహన్, సభ్యులు కిల్లంపల్లి రామారావు, మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు బాబూరావు, హరి ఉన్నారు.

మహిళలకు ధ్రువపత్రాలు

శృంగవరపుకోట, మే 12 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట టీచర్స్ కాలనీలో నిర్వహిస్తున్న కుట్టుమిషన్ శిక్షణ కేంద్రానికి చెందిన 60 మంది మహిళలకు శిక్షణ ధ్రువపత్రాలను సోమవారం పంపిణీ చేశారు. మహిళలకు నైపుణ్యం పెంచడంతో పాటు స్వయం ఉపాధికి శిక్షణ దోహదపడుతుందని నిర్వాహకుడు దొడ్డి సూర్యారావు, హేమలత, శిక్షకురాలు కృష్ణవేణి అన్నారు.

ఏజీపీగా శ్రీనివాస్



రాజాం రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పి.శ్రీనివాస్‌ను అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి (లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్) గొట్టాపు ప్రతిభాదేవి సోమవారం ఉత్తర్వులు వెలువరించారు. 23 ఏళ్లుగా రాజాంలో న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్న శ్రీనివాస్ మూడేళ్ల పాటు ఏజీపీగా కొనసాగుతారు.

ముగిసిన సంబరాలు

డెంకాడ, మే 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మూడు రోజులుగా జరుగుతున్న సింహాద్రి అప్పన్న సంబరాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం నుంచి స్వామివారి సంబరాల అనంతరం చంపావతిలో పూజా సామగ్రిని నిమజ్జనం చేశారు. సంబరాల్లో దాసుడు అప్పలనాయుడు, పైడియ్య కుటుంబ సభ్యులు, రొంగలి గోపాలకృష్ణ, రొంగలి అక్కమ్మ, ఎస్.అరుణ సూర్యనారాయణ దేవుడు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

'పల్లా'కు జన్మదిన శుభాకాంక్షలు

శృంగవరపుకోట, మే 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు సోమవారం శృంగవరపుకోట జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇటు ఎమ్మెల్యేగా, అటు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న ఒబ్బిన

20 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మంత్రి కొండపల్లి

గజపతినగరం, మే12 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా పారిశ్రామిక, వ్యాపార అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఉత్తరాంధ్రలో ఫార్మా క్లస్టర్, పెట్రో కెమికల్స్ స్టీల్ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయన్నారు. ప్రతీ నియోజకవర్గంలో స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. ఆసక్తిగల విద్యార్థులకు విదేశీ విద్యను అందించడంతో పాటు వారికి శిక్షణ ఇచ్చి విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా సీఎం చంద్రబాబు చర్యలు చేపడుతు న్నారన్నారు. అనంతరం గతంలో నైపుణ్య శిక్షణ పూర్తి చేసిన యువతకు ధ్రువపత్రాలను అందజేశారు. మెగాజాబ్ మేళాకు 1264 మంది అభ్యర్థులు హాజరు కాగా అందులో 451 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, టీడీపీ నాయకులు రామ్‌కుమార్, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలు నెలకొల్పండి

●మంత్రి లోకేశ్‌కు రామ్‌మల్లిక్ విజ్ఞప్తి





లోకేశ్‌తో రామ్‌మల్లిక్, మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ

చీపురుపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన చీపురుపల్లి నియోజకవర్గంలో అనువైన పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రి లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు కోరారు. అమరావతిలో సోమవారం లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు పలు సమస్యలు పరిష్కరించాల్సి ఉందన్నారు. నియోజకవర్గంలో 12 పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయనీ, వాటి స్థానంలో భవనాలు నిర్మించాలని కోరారు. తోటపల్లి కాలువలో పూడికతీత పనులు సకాలంలో చేపట్టి రైతులను ఆదుకోవాలని రామ్‌మల్లిక్ విన్నవించారు.

●విజయనగరం దాసన్నపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో మంత్రి లోకేశ్‌ను సోమవారం మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్తరాంధ్రలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని లోకేశ్‌ను కోరారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

రేగిడి, మే 12, (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్లు అని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పునరుద్ఘాటించారు. సోమవారం మండలంలో నాలుగు బీటీ రోడ్లకు ఆయన స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఇందుకు గానూ పెద్దశిర్లాం-కాగితాపల్లికి రూ.1.10 కోట్లు, చిన్నయ్యపేట-రేగిడి రహదారికి రూ. 1.56 కోట్లు, దేవుదళ-గోపంపేటకు రూ.40 లక్షలు, అంబఖండి-వావిలవలస రోడ్డుకు రూ.70 లక్షలు చొప్పున మంజూరయ్యాయి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. అందులో భాగంగా ఈనెలలో రైతులకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం నగదు జమ చేయనున్నారన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, పి.రామచంద్రినాయుడు, కర్ణేన మహేశ్వరరావు, పాలవలస రమణమూర్తి, పాలూరి రామినాయుడు, గురవాన నారాయణరావు, జి.ధనంజయరావు, నారు జనార్దనరావు, కర్రి రమణ, గంగు కృష్ణ, బట్న తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరదేశమ్మకు ఎమ్మెల్సీ పూజలు



అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్సీ

శృంగవరపుకోట రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఖండేపల్లిలో నిర్మించిన పరదేశమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సుధారాజు సోమవారం పూజలు నిర్వహించారు. దేశప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. భారతసైన్యానికి అందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణమహంతిపురం సహకార సొసైటీ చైర్మన్ ఇందుకూరి రామరాజు, గ్రామపెద్దలు ఉన్నారు.

సత్యజ్ఞానాంబకు సత్కారం



సత్యజ్ఞానాంబను సత్కరిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట సత్యజ్ఞానానంద స్వామి ఆశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపక ఆధ్యాత్మిక గురువు సత్యజ్ఞానానంద జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరివిడి ఎంఈవో పోలుబోతు రామారావు ఆధ్వర్యంలో సత్సంగం జరిగింది. ఆశ్రమ ప్రస్తుత పీఠాధిపతి మాతా సత్యజ్ఞానాంబను సత్కరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, గ్రామ పెద్దలు, కౌన్సిలర్లు, ఆశ్రమ నిర్వహణ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

సత్సంగాలతో జ్ఞానం

రేగిడి, మే 12, (ఆంధ్రజ్యోతి): దైవ చింతన, సత్సంగాలతో మనిషిలో జ్ఞానం సిద్ధిస్తుందని పలువురు ఆధ్యాత్మిక వేత్తలు పేర్కొన్నారు. మండలంలో రేగిడి దత్తపీఠంలో సోమవారం దత్తపీఠ నిర్వహకులు కిమిడి సూరపనాయుడు, కిమిడి రవికుమార్‌ల ఆధ్వర్యంలో దివ్యజీవన సత్సంగం నిర్వహించారు. సమావేశానికి పాలకొండకు చెందిన సత్యసాయి ప్రతినిధి ఎన్‌వీ రమణ, ఊడికలపాడుకు చెందిన ఎస్.కరుణాకర్, సామంతుల దామోదరరావు, దేవుదళకు చెందిన గొర్లి దామోదర రావు, స్థానిక దత్తపీఠ కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు తదితరులు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో రేగిడి, ఆమదాలవలస భక్తులు పాల్గొన్నారు.

విజేతకు అభినందనలు

రేగిడి, మే 12, (ఆంధ్రజ్యోతి): ఇటీవల అమరావతిలో నిర్వహించిన పురుషుల యోగాసన పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైన మండలంలోని పెద్దలింగాలవలసకు చెందిన రెడ్డి గౌరినాయుడును ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అభినందించారు. మండలంలో అంబఖండి గ్రామంలో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యే కోండ్రును గౌరినాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గౌరినాయుడును ఎమ్మెల్యే అభినందించి, భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

అర్జీదారులు సంతృప్తి చెందాలి

● కలెక్టర్ అంబేడ్కర్ ● పీజీఆర్ఎస్‌కు 136 వినతులు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 136 అర్జీలను వారు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జేసీ మాట్లాడుతూ ఆయా సమస్యలను వీలైనంత వేగంగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, కేఆర్‌సీ ఎస్‌టీసీ మురళీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, నూకరాజుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

విజయనగరం క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 46 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ఫిర్యాదులు పూర్వపరాలను విచారణ చేసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. వారంలోగా జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కె చౌదరి, సుధాకర్, ఎస్ఐ రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

డోలపేటలో భూములు స్వామివార్లవే

● 27 కేసుల్లో ట్రిబ్యునల్ తీర్పు



గతంలో బోర్డులు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

రాజాం, మే 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలటీ పరిధిలోని డోలపేటలోని ఉమా మహేశ్వర, లక్ష్మీనారాయణస్వామి వారి ఆలయానికి చెందిన భూముల వ్యవహారంలో దేవాదాయ శాఖ అధికారులు నమోదు చేసిన ఓఏ కేసుల్లో 27 కేసులు పరిష్కారమయ్యాయి. ఆ భూములన్నీ దేవాదాయశాఖ పరిధిలోని ఉమామహేశ్వర, లక్ష్మీనారాయణస్వామి దేవస్థానానికి చెందినవేనని ట్రిబ్యునల్ తీర్పు వెలువరిచింది. దాంతో వాటిని స్వాధీనం చేసుకునేందుకు దేవాదాయశాఖ అధికారులు సమయాత్తమయ్యారు. డోలపేటలోని దేవస్థానానికి చెందిన భూముల వ్యవహారంపై ఇప్పటి వరకు దాదాపుగా 140 ఓఏ కేసులు నమోదయ్యాయి. తమ అనుమతి లేకుండా ఇళ్లు దుకాణాలు నిర్మితమయ్యాయంటూ సంబంధిత నివాసితులను ఆక్రమణదారులుగా గుర్తిస్తూ వారిపై దేవాదాయశాఖ అధికారులు ఓఏ కేసులు నమోదు చేశారు. ఆ భూములు సారధి రెవెన్యూ గ్రామం పరిధిలోని డోలపేట చెక్ పోస్ట్ ఎదురుగా ఉన్నాయి. ఈ విషయంపై ఈవో బీవీ మాధవరావును దీనిపై వివరణ కోరగా డోలపేటలోని దేవాదాయ భూములు వ్యవహారంలో ఓఏ కేసులపై తీర్పులు వచ్చాయని తదుపరి చర్యలు నిమిత్తం ఉన్నతాధికారులతో చర్చించనున్నట్లు తెలిపారు.

మురళీనాయక్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న పడాల అరుణ

గజపతినగరం, మే12 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి జనసేన పీఏసీ సభ్యురాలు పడాల అరుణ తన నివాసంలో సోమవారం పార్టీ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మునకాల జగన్, పీవోసీ ఆదాడ మోహన్, ఉమ్మడి జిల్లాల కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు మామిడి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'మా భూములు కంపెనీలకు ఇవ్వొద్దు'



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వేపాడ, మే 12 (ఆంధ్రజ్యోతి): మా భూములను కంపెనీలకు అప్పగించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని మండలంలోని మారిక గిరిజనులు డిమాండ్ చేశారు. పంచాయతీ పాలకులు, మారిక గిరిజన రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం విజయనగరం ఆర్డీవో ప్రమీలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా రైతుసంఘం ప్రతినిధి చల్లా జగన్ మాట్లాడుతూ గిరిజనులు కొండకోనల్లో ప్రకృతిని నమ్ముకుని జీవిస్తున్నారన్నారు. వారు వ్యవసాయం చేసుకుని బతుకుతుంటే వారి భూములను కంపెనీలకు కట్టబెట్టడమేంటని ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు.

తైక్వాండో కోచ్‌కు సత్కారం



కోచ్ అబ్బాస్ షేకీని సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇరాన్ దేశానికి చెందిన తైక్వాండో కోచ్ అబ్బాస్ షేకీని న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. సోమవారం స్థానిక రాజీవ్ ఇండోర్ స్టేడియం మూడో జాతీయ తైక్వాండో స్పారింగ్ టెక్నిక్ సెమినార్ నిర్వహించారు. సెమినార్‌కు ఆంధ్ర, తమిళనాడు, కేరళ, తెలంగాణ నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారని అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.వేణుగోపాలరావు తెలిపారు. ఈ నెల 15 వరకూ సెమినార్‌ను నిర్వహించనున్నామన్నారు. ముఖ్య అతిథులుగా అసోసియేషన్ అధ్యక్షుడు పురుషోత్తం, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి శ్రీహరి, ఉపాధ్యక్షుడు నాయబ్ రసూల్, సహాయ కార్యదర్శి జగన్మోహనరావు, ఈసీ సభ్యులు శ్రీనివాస్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



చిరంజీవి (ఫైల్)

తెర్లాం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన కొత్తకోట చిరంజీవి (20) సోమవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు ఎస్.ఐ సాగర్‌బాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. చిరంజీవి ఎలక్ట్రిక్ లైటింగ్ పనులు నిమిత్తం ఈనెల 11న కొల్లివలస గ్రామానికి వెళ్లాడు. సోమవారం ఉదయం పెళ్లిలో ఏర్పాటు చేసిన లైటింగ్ తీసే సమయంలో స్టేజ్‌కు అమర్చిన పోల్‌ను తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి తండ్రి రమణ, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. తండ్రి రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. యువకుడి మృతితో కొల్లివలసలో విషాదఛాయలు అలుముకున్నాయి.

లారీ క్లీనర్ ఆత్మహత్య

సాలూరు, మే 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దబ్బి వీధికి చెందిన గంట దినేష్(38) సోమవారం తన ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లారీ క్లీనర్‌గా పనిచేస్తున్న దినేష్ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. నిత్యం మద్యం తాగుతుండేవాడు. సోమవారం కూడా ఎప్పటిలాగే మద్యం తాగేందుకు తల్లిని డబ్బులు అడిగాడు. ఆమె అందుకు నిరాకరించడంతో మనస్తాపం చెంది ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. మృతుడి తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఆసుపత్రిలో భార్యను చూసేందుకు వెళ్తూ..

● విద్యుత్ స్తంభాన్ని ఢీకొని భర్త మృతి

పాచిపెంట, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భార్యను చూడడానికి వెళ్తూ భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పి.కోనవలస కళాశాల మలుపు వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బడ్నానవలసకు చెందిన బోయిన లక్ష్మణరావు(31)కు, తన భార్య ఉషకు మధ్య నిత్యం గొడవలు జరుగుతుండేవి. దీంతో లక్ష్మణరావు మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో మనస్తాపం చెందిన ఉష ఆదివారం ఇంట్లో ఉన్న గుర్తుతెలియని మాత్రలు మింగేసింది. లక్ష్మణరావు వెంటనే పాచిపెంట ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. అక్కడి నుంచి వైద్య సిబ్బంది మెరుగైన వైద్యం కోసం సాలూరు ఆసుపత్రికి తరలించారు. లక్ష్మణరావు తన భార్యను చూడడానికి బైకుపై సాలూరు బయలుదేరాడు. మార్గమధ్యంలో పి.కోనవలసలో గల కళాశాల వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభానికి ఢీకొట్టాడు. తీవ్ర గాయాలపాలైన లక్ష్మణరావును సాలూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మణరావు మృతిచెందాడు. ఈ ఘటనపై ఎస్ఐ కె.వెంకటసురేష్ కేసు నమోదు చేశారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చూడి ఆవులు సజీవదహనం

వేపాడ, మే 12 (ఆంధ్రజ్యోతి): వేపాడలో ఆదివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రెండు చూడి ఆవులు సజీవ దహనమయ్యాయి. నువ్వుల మెట్టకు వెళ్లే రహదారిలో నిరుజోగి కృష్ణకు పశువులశాల ఉంది. దానికి ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దాంతో రెండు చూడి ఆవులు మృతి చెందాయి. జీవనాధారం కోల్పోయానని బాధితుడు ఆవేదన వెలిబుచ్చాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

మహిళపై దాడి

పార్వతీపురంటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో ఓ మహిళపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసినట్టు పట్టణ ఎస్ఐ గోవిందరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి పట్టణానికి చెందిన పావనిపై అదే వీధికి చెందిన సురేష్, చిన్నికృష్ణ దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

నెల్లిమర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మిమ్స్ గేటుకు సమీపంలో సోమవారం ఓ కారు డివైడర్‌ను ఢీకొట్టింది. నెల్లిమర్ల నుంచి విజయనగరం వైపు వెళుతున్న కారు ప్రధాన రహదారికి పాత రహదారికి మధ్యనున్న డివైడర్‌ను ఢీకొట్టి దానిపైకి ఎక్కింది. ముందుగా అక్కడ చెట్టు, ట్రాఫిక్ బోర్డును ఢీకొట్టింది. గట్టుపైకి ఎక్కి దిగువకు ఒరిగిపోయింది. దీంతో పెద్ద ప్రమాదమే తప్పింది. కారులో ఉన్న వారికి గానీ, అదే సమయంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న వారికి గానీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి మండలంలోని పెదనడిపల్లిలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం అదుపులోకి తీసుకుని 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎం.రమణ తెలిపారు. దాడుల్లో హెచ్‌సీ శ్రీధర్, ఈసీలు నాయుడు, మనోజ్ పాల్గొన్నారన్నారు.

తాగునీరు కలుషితం

●సర్పంచ్ ఇంటి ఎదుట మహిళల నిరసన



సర్పంచ్ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

శృంగవరపుకోట రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజర్ పంచాయతీ ధర్మవరంలోని యాతవీధి, పెంటవీధి మహిళలు తాగునీటి కలుషితంపై మండిపడ్డారు. మా ఆరోగ్యాలతో ఆడుకుంటారా అని సోమవారం సర్పంచ్ ఇంటి ఎదుట నిరసనకు దిగారు. న్యాయవాది మండా కామేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళలు ఆందోళనకు దిగారు. పంచాయతీ కార్యాలయానికి తాళాలు వేసి ఉండటంతో సర్పంచ్ ఇంటికి చేరుకుని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మురుగునీటి కాలువల్లో పైపులైన్లు ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. కొద్దిరోజుల కిందట వరకూ తాగునీరు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. ఈ విషయం పంచాయతీ ఈవో, సర్పంచ్‌కు చెప్పిన పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని న్యాయవాది కామేశ్వరరావు హెచ్చరించారు. ఇదేవిషయంపై ఈవో శేఖర్ వివరణ కోరగా తాను సెలవులో ఉన్నానన్నారు. తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు.

జీవో నెంబరు 117ను రద్దు చేయండి

విజయనగరం కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబరు 117ను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. దాని స్థానంలో కొత్త జీవోను విడుదల చేసి పాఠశాలలను పునర్వ్యవస్థీకరించాలని కోరారు. సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

25 శాతం సీట్లు కేటాయించాలి

శృంగవరపుకోట, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పేద విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించాలని ఎంఈవో బి.నరసింగరావు ఓ ప్రకటనలో సూచించారు. పాఠశాలలో ఉచితంగా విద్యను పొందేందుకు ఈనెల 15లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఎంఈవో కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు.

ఘనంగా అన్నమాచార్య జయంతి

విజయనగరం బాబామెట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బుక్కా వీధిలోని ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో సోమవారం పద కవితా గాన గంధర్వుడు తాళ్లపాక అన్నమాచార్యులు 617వ జయంతిని నిర్వహించారు. దశగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ, ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు దవళ సర్వేశ్వరరావు, డాక్టర్ మండపాక రవి, పలువురు కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

ఏడాదిన్నర దాటినా.. పూర్తికాలే..!

(5వ పేజీ తరువాయి)

శ్లాబు ఎత్తువరకు వచ్చినవి 130, శ్లాబు పూర్తయినవి 130 వరకు ఉన్నాయి. నిర్మాణాలు పూర్తయినవి 402 కాగా 54 ఇళ్ల నిర్మాణాలు నేటికీ ప్రారంభించలేదు.

చెల్లింపుల్లో జాప్యం..

బిల్లుల చెల్లింపులు ఆలస్యమవడంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. అందుకనే మా గ్రామానికి మంజూరైన ఏడు గృహాల పనుల బాధ్యతను కాంట్రాక్టర్‌కు అప్పగించాం. మాపై ఎటువంటి ఆర్థిక భారం పడడం లేదు. సదరు కాంట్రాక్టర్ కూడా పనులు వేగవంతం చేస్తున్నారు.

-ఎస్.హరిబాబు, తురాయిమానుగూడ

హౌసింగ్ ఏఈ ఏమన్నారంటే...

'పీఎం జన్‌మన్ పథకం కింద గిరిశిఖర గ్రామాల్లో మంజూరైన గృహ నిర్మాణాల పనులు జరుగుతున్నాయి. బిల్లుల చెల్లింపులు చేస్తున్నాం. కొద్ది రోజుల కిందట 102 మంది లబ్ధిదారుల బ్యాంక్‌ఖాతాల్లో నగదు జమైంది.' అని హౌసింగ్ ఏఈ సీహెచ్ వెంకటేష్ తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● మంత్రి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, మే 12(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్త్రీ శిశు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మామిడిపల్లి గ్రామంలో రూ.21 లక్షలతో నిర్మిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ భవనానికి ఆమె సోమవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు రుణాలు, పెట్టుబడులు అందించడంలో ఈ సంఘం తోడ్పడుతుందని, గ్రామీణ వ్యవసాయ అభివృద్ధికి ఇది మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేష్, డొంక అన్నపూర్ణమ్మ, బూస తవుడు, మత్స శ్యామ్ పాల్గొన్నారు.

ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోండి

రామభద్రపురం, మే 12(ఆంధ్రజ్యోతి): కొత్త ఇళ్ల కోసం ఈ నెలాఖరులోగా దరఖాస్తులు చేసుకోవాలని మండల హౌసింగ్ అధికారి మత్స వెంకటేష్ తెలిపారు. సోమవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. భార్యాభర్తల ఆధార్, రేషన్‌కార్డు, ఇన్‌కం సర్టిఫికెట్లు తీసుకుని వెళ్లి సచివాలయంలో ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు మండలంలో సొంత స్థలం ఉన్నవారు 1,334 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అలాగే గత ప్రభుత్వం అసంపూర్తిగా వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలకు ప్రస్తుత ప్రభుత్వం రూ.50వేలు పెంచిందని తెలిపారు. జూన్ నెలలో కొత్త ఇళ్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అలాగే తహసీల్దార్ ఆకుల సులోచనారాణి మాట్లాడుతూ 362 మంది స్థలంతో పాటు ఇళ్ల నిర్మాణాలనకు దరఖాస్తులు చేశారని, వీఆర్వో ద్వారా పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

రామభద్రపురం, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెలమల ప్రసాదరావు హెచ్చరించారు. ఆదివారం రాత్రి కొండకెంగువ గ్రామంలో ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగింది. ఈసందర్భంగా వారందరిని సోమవారం స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ముఖ్యంగా యువత మద్యానికి బానిసై కొట్లాటల్లో పాల్గొంటే జీవితాలు నాశనం అవుతాయని తెలిపారు. ఇరువర్గాల మధ్య కేసులు నమోదు చేయడమే కాకుండా కఠినమైన సెక్షన్లు విధించి కోర్టుకు పంపిస్తామని హెచ్చరించారు. కొండకెంగువ గ్రామంలో యువత చెడు వ్యసనాలకు బానిసై తరచూ ఘర్షణలకు దిగడంపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇప్పటికైనా గ్రామస్థులు ఐకమత్యంతో ఉండాలని సూచించారు.

ప్రభుత్వ భవనం దుర్వినియోగంపై ఆరా

బొబ్బిలి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): పిరిడి గ్రామంలోని ఎస్సీ కాలనీలో గల అంబేడ్కర్ భవనాన్ని అదే గ్రామానికి చెందిన గుంట తాతబాబు ఆక్రమించుకుని, సొంతానికి వినియోగించుకుంటున్నారని గ్రామస్థుడు లింగాల శ్రీనివాసరావు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు సాంఘిక సంక్షేమ శాఖ ఏఎస్‌డబ్ల్యూవో టి.సత్యనారాయణ సోమవారం ఆ గ్రామంలో పర్యటించి, భవనాన్ని సందర్శించారు. ఈసందర్భంగా స్థానిక సర్పంచ్ టి.వరలక్ష్మి, పొందూరు రామారావు తదితరులు మాట్లాడుతూ ఈ భవనాన్ని దళిత సమాజానికి రాజకీయ చైతన్యం కలిగించేందుకు, నాటికలు, కళలను ప్రదర్శించేందుకు నిర్మించారని తెలిపారు. కానీ తాతబాబు స్వప్రయోజనాలకు వినియోగించుకుంటున్నారని చెప్పారు. తక్షణమే ఈ భవనాన్ని స్వాధీనం చేసుకుని, అందుబాటులోకి తీసుకురావాలని ఎస్‌డబ్ల్యూవోని కోరారు. దీనిపై అధికారులకు నివేదిక అందిస్తానని ఎస్‌డబ్ల్యూవో తెలిపారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట వేయాలి

బొబ్బిలి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలని ఉత్తరాంధ్ర సాధన సమితి వ్యవస్థాపకుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. సోమవారం బొబ్బిలి ఎన్జీవో హోంలో ఆయన అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సాగు ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర ఎన్జీవో హోం నాయకుడు రౌతు రామమూర్తినాయుడు, రైతు నాయకుడు గోపాలం, సంచార జాతుల అభివృద్ధి మండలి గౌరవ సలహాదారు రాముద్రి గోవిందరావు, జైహింద్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నర్సుల దినోత్సవం



బాడంగి సీహెచ్‌సీలో నర్సులను సత్కరిస్తున్న దృశ్యం

బాడంగి, మే 12 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా సోమవారం బాడంగి సీహెచ్‌సీలో హెడ్ నర్స్ పి.భవానితో పాటు 8మంది స్టాఫ్ నర్సులను రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు, ప్రతినిధులు ప్రవీణ్‌కుమార్, పి.కృష్ణమోహన్ పాల్గొన్నారు. ● బొబ్బిలి రూరల్: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా సోమవారం బొబ్బిలిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సులను అభినందిస్తూ వనమిత్ర కృష్ణదాస్ మొక్కలను బహూకరించారు.

రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం

బొబ్బిలి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సహాయ ఎన్నికల నమోదు అధికారి గౌరీశంకర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు, బదిలీల ప్రక్రియ తదితర అంశాలపై చర్చించారు. ఓటరు కార్డుకు ఆధార్ నెంబర్ అనుసంధానంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీటీ సుబ్బారావు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో అర్జీలు పరిష్కరించాలి

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

● పీజీఆర్ఎస్‌కు 92 వినతులు



పాలకొండ: వినతిపత్రం స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 92 మంది అర్జీదారుల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జేసీ శోభిక, ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో హేమలత, ఎస్‌డీసీ పి.ధర్మాచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి పాల్గొని, వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్జీలు మళ్లీ రీఓపెన్ అయ్యే పరిస్థితి ఉండరాదన్నారు.

విజ్ఞప్తులు ఇలా..

జియమ్మవలస మండలం డంభద్ర నుంచి దొనక లక్షుం అర్జీని అందిస్తూ తన తండ్రికి ఇచ్చిన డీపట్టా భూమిలోని కొంత స్థలం ఆక్రమణకు గురైందని, తన భూమిని తనకు ఇప్పించాలని కోరారు. సాలూరు మండలం ఎం.ఎం.గాదిపల్లివలస నుంచి సీహెచ్ గంగులు దరఖాస్తు అందిస్తూ తన భూమిని ఇతరులు విక్రయించారని, విచారణ జరిపి తనకు న్యాయం చేయాలన్నారు. పాలకొండ నుంచి కె.వీరభద్రరావు వినతిపత్రాన్ని అందిస్తూ తాను అవుట్‌సోర్సింగ్ శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తూ ఏసీబీకి పట్టుబడ్డానని, హైకోర్టులో కేసు ఉందని, తీర్పు రాకముందే ఆ పోస్టును భర్తీ చేస్తున్నారన్నారు. తీర్పు వచ్చే వరకు నిలుపుదల చేయాలని కోరారు. ఇలా పలువురు వినతిపత్రాలు అందజేశారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో లోపాలపై ఫిర్యాదు

పాలకొండ/ బెలగాం: నగర పంచాయతీలో లోపాలపై సామాజిక కార్యకర్త దుంపల రమేష్ బాబు(చిన్ని) కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారితో దుంపల రమేష్ బాబు మాట్లాడుతూ సిల్ట్ క్లియరెన్స్ మీద అవినీతి జరిగిందని, ఆరోపణలు వచ్చినా విచారణ జరగలేదన్నారు. విచారణ జరిపించాలని కోరారు. అలాగే పాలకొండ నగర పంచాయతీలో అడ్డగోలుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు నియామకం అవుతున్నాయని, దీనిపై విచారణ చేపట్టాలన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు: ఎస్పీ



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని ఎస్పీ ఎస్‌వీ మాధవ రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 12 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ తెలిపారు. భూ వివాదాలు, ప్రేమ పేరుతో మోసాలు, కుటుంబ తగాదాలు, నకిలీ పత్రాలు, అత్తారింటి వేధింపులు, అధిక వడ్డీలు, సైబర్‌క్రైం తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదాం, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ ఇప్పించండి సారూ..



గంగమ్మను కుర్చీపై తీసుకెళ్తున్న బంధువులు

బెలగాం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా మంచంపైనే జీవనం సాగిస్తున్న తనకు పింఛన్ మంజూరు చేయడంలేదని, పింఛన్ ఇప్పించండి సారూ అంటూ మక్కువ మండలం, డి.శిర్లాం గ్రామానికి చెందిన రాపాక గంగమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం తన బంధువుల సహాయంతో ఆటోలో కలెక్టర్ కార్యాలయానికి వచ్చింది. ఆమెను కుర్చీతో కలెక్టర్ వద్దకు తీసుకువెళ్లారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గత ఐదేళ్ల నుంచి మంచం పైనే ఉంటున్నానని, భారంగా బతుకు సాగిస్తున్నానని ఆమె వెల్లడించింది. ఎప్పటి నుంచో అభయహస్తం కింద రూ.500 మాత్రమే ఇస్తున్నారని, పింఛన్ ఇవ్వడం లేదని తెలిపింది.

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 22 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 22 వినతులు వచ్చాయి. వ్యవసాయ సాగుభూమి కోసం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని భామిని మండలం సన్యాయిగూడకు చెందిన గిరిజనులు పీవోను కోరారు. టిటుకుపాయిగూడ గ్రామానికి వరదగోడ మంజూరు చేయాలని ఆరిక శ్యామలరావు కోరగా, మల్లి గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్య పరిష్కరించాలని సవర భూగన్న కోరారు. కుంబి గ్రామంలో అంగన్‌వాడీ భవనం నిర్మించాలని కె.రామారావు, గృహ నిర్మాణ బిల్లు ఇప్పించాలని సవర సింహాచలం, ఐదు నెలల జీతం ఇప్పించాలని నిమ్మక లక్ష్మిలు పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఈత మానుగూడ గ్రామానికి రహదారి నిర్మాణం పూర్తిచేయాలని సవర భారతి కోరారు. బిల్లుమడ గ్రామ సమీపంలోని గిరిజనుల సాగులో ఉన్న భూ సమస్యను పరిష్కరించాలని పలువురు గిరిజనులు పీవోను కోరారు. దీనిపై పీవో స్పందిస్తూ జిరాయితీ భూమిపై తమకు ఎటువంటి హక్కులు ఉండవని, అక్కడ నివసిస్తున్న గిరిజనుల కోసం ప్రత్యామ్నాయంగా వేరే ప్రదేశంలో స్థలం కేటాయించేందుకు పరిశీలిస్తామని గిరిజనులకు ఇన్‌చార్జి పీవో సూచించారు. ఏపీవో జి.చిన్నబాబు, టీడబ్ల్యూ ఈఈ పి.రమాదేవి, పీహెచ్‌వో ఆర్‌వీ గణేష్, ఏఎంవో కోటిబాబు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఐకేపీ ఏపీడీలు శ్రీహరి, సన్యాసిరావు పాల్గొన్నారు.

తోటపల్లి ప్రాంతంలో తనిఖీలు



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు ప్రాంతాన్ని గరుగుబిల్లి ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడుతో పాటు పలువురు సిబ్బంది సోమవారం నిశితంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు పరిసర ప్రాంతాలను తనిఖీ చేసి, నివేదికలు అందిస్తున్నామని తెలిపారు. బాంబు స్క్వాడ్, డిస్పోజల్ బృందం, డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేశామని చెప్పారు. ప్రాజెక్టుతో పాటు స్పిల్‌వే గేట్లు, తదితర ప్రాంతాలను తనిఖీ చేశామన్నారు.

ఘనంగా సత్యసాయి రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

వీరఘట్టం, మే 12 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలో సోమవారం భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి ప్రేమవాహిని రథ యాత్ర నిర్వహించారు. పుట్టపర్తి నుంచి వచ్చిన ఈ రథానికి స్థానికులు స్వాగతం పలికారు. భజన కార్యక్రమాలతో ఊరేగింపుగా వెళ్లారు. కార్యక్రమంలో సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించండి

మక్కువ, మే 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలను పునర్‌వ్యవస్థీకరణ చేస్తున్న తరుణంలో పంచాయతీ కార్యదర్శులకు మెరుగైన పదోన్నతులు కల్పించాలని మండలంలోని కార్యదర్శుల సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పి.దేవకుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడి

బొబ్బిలి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): నవ ధాన్యాల సాగుతో అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ రీజనల్ కోఆర్డినేటర్ కె.ప్రకాష్ తెలిపారు. సోమవారం మెట్టవలస గ్రామంలో ఆయన నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ ఎం.శ్యామ్‌సుందర్, బొబ్బిలి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వీఏఏలు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

రామభద్రపురం, మే 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు బుధవారం నుంచి ఆక్రమణలు తొలగించనున్నామని తహసీల్దార్ ఆకుల సులోచనారాణి తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే ఆక్రమణ స్థలాల్లో రెడ్ మార్కు ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 50 అడుగులు వరకు తొలగిస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రొక్లయినర్ల ద్వారా తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

అన్నమయ్యకు నివాళి

బొబ్బిలి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జయంతి సందర్భంగా సోమవారం బొబ్బిలిలోని రాణీ మల్లమ్మదేవి పార్క్ గట్టున ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం దరిలో గల ఆయన విగ్రహానికి పలువురు పూలమాల వేసి, నివాళులు అర్పించారు. కమిటీ సభ్యుడు మరిపి తిరుపతిరావు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యుడు పల్లెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అన్నమయ్య విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పిస్తున్న దృశ్యం

సాగునీటి కాలువల్లో పూడికలను తొలగించాలి

గరుగుబిల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): జంఝావతి ప్రాజెక్టు పరిధిలోని ప్రధాన కాలువల్లో పూడికలను తొలగించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అప్పలనాయుడు డిమాండ్ చేశారు. కొంకడివరం ప్రాంతంలో కాలువలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా పూడికలతో పాటు గుర్రపు డెక్కను తొలగించకపోవడంతో సాగునీరందని పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు కాలువల పరిస్థితిని పరిశీలించి రానున్న ఖరీఫ్‌కు సాగునీరు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలో కుడి, ఎడమ ప్రధాన కాలువల ఆధునీకరణతో పాటు రావాడ, పెదంకలాం, సీతానగరం, వెంగళరాయసాగర్ ప్రాజెక్టుల ఆధునీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ పరిశీలనలో సర్పంచ్ అల్లు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● తోటపల్లి పాత బ్యారేజీ పరిధిలోని ఎడమ కాలువలో పిచ్చిమొక్కలు తొలగించాలని టీడీపీ అరకు పార్లమెంటరీ బీసీ సెల్ అధికార ప్రతినిధి, నాగూరు ఎంపీటీసీ సభ్యుడు ద్వారపురెడ్డి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం ఎడమ కాలువ పరిధిలోని పలు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కాలువలో పిచ్చిమొక్కలు తొలగించాలని కోరారు. అలాగే కాలువ పరిధిలో కల్వర్టును నిర్మించాలని డిమాండ్ చేశారు.

నాడు అలా.. నేడు ఇలా..

● కొత్తగా రూపు దిద్దుకుంటున్న అంతర్గత సీసీ రహదారులు



గతంలో గొడౌన్ వద్ద బురదమయమైన రహదారి



ప్రస్తుతం నిర్మించిన సీసీ రహదారి

సీతంపేట రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీతంపేట ఏజెన్సీలో అంతర్గత సీసీ రహదారులు ప్రాధాన్యత క్రమంలో నిర్మిస్తున్నారు. దీనిలో భాగంగా ఐటీడీఏకి సమీపంలో ఉన్న ఉన్న సివిల్ సప్లయి గొడౌన్‌కు వెళ్లే రహదారిని నిర్మించారు. గత కొన్నేళ్లగా ఈ దారి నిత్యం బురదమయంగా ఉండేది. గొడౌన్‌కు వచ్చే లారీలు మట్టిలో దిగబడుతుండేవి. ఈ సమస్యను గుర్తించిన పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ.. ఈ రహదారి నిర్మాణానికి రూ.10లక్షలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గొడౌన్‌కు వెళ్లే దారిలో అంతర్గత సీసీరోడ్డును ఏర్పాటు చేశారు.

న్యూస్ బాక్స్

జనవాణిలో ఎమ్మెల్యే జయకృష్ణ



వినతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, మే 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సోమవారం పాల్గొన్నారు. అనేకమంది తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వినతులను పరిశీలించిన ఆయన సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కరణకు కృషి చేయాలన్నారు.

బెల్లంఊట ధ్వంసం

పాలకొండ, మే 12 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా గుణుపూర్ బ్లాక్ పరిధిలోని భామిని మండలం సరిహద్దు గ్రామాలైన మంగలగూడ, కొత్తగూడ, కంగమానుగూడ గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ఎక్సైజ్ బృందాలు సోమవారం ఉమ్మడిగా దాడులు నిర్వహించాయి. సారా తయారీకి ఉపయోగించే సుమారు 23వేల లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు. పాలకొండ, కొత్తూరు, రాజాం, చీపురుపల్లి, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారని పాలకొండ ఎక్సైజ్ సీఐ కె.సూర్యకుమారి తెలిపారు.

క్రికెట్ పోటీల్లో విజేత 'బత్తిలి'



ట్రోఫీతో విజేత జట్టు

భామిని, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజపతినగరం యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో బత్తిలి జట్టు విజేతగా నిలిచింది. బాలేరు జట్టు రన్నర్‌గా నిలిచింది. 25 టీమ్‌లతో నెల రోజులుగా నిర్వహిస్తున్న ఈ పోటీలు సోమవారంతో ముగిశాయి. బత్తిలి యువరాజ్ యూత్ జట్టు విజయం సాధించడంతో రూ.15 వేలు ప్రోత్సాహక బహుమతితో పాటు ట్రోఫీ అందించారు. రన్నర్ టీమ్ బాలేరుకు రూ.8వేలు నగదు బహుమతి అందించారు. బత్తిలి ట్రైనింగ్ ఎస్‌ఐ శివనగరెడ్డి, ఏఎస్‌ఐ కాంతారావు, స్థానికులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా వ్యాపారమ్మ పండగ



అమ్మవారి గుడి వద్దకు ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

గుమ్మలక్ష్మీపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలో గ్రామదేవత వ్యాపారమ్మ పండగలో భాగంగా మొదటి రోజు అమ్మవారి పాదాలు తీసుకొచ్చే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. గ్రామస్థులంతా సాయంత్రం అమ్మవారి గుడి నుంచి చదురు గుడికి పాదాలు తీసుకొచ్చి, ఘటాలు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.